కామెడీ కథ

# నాలుగిళ్ళ చావిడి

పక్కవాటాలోని పరంధామం అరుపులకి మెలకువ వచ్చింది రాజాకి. రాత్రి ఆలస్యంగా పడుకోవడం వల్ల కళ్లు తెరవాలనిపించలేదతనికి. మెల్ల మెల్లగా కళ్ళు తెరచి ఓరకంటితో వాల్‌క్లాక్ వంక చూశాడు. ఐదున్నర అయింది.

ఆదివారమేగా. ఓ గంట ఆగి లేస్తే సరి అనుకొంటూ కళ్ళు మూసుకొన్నాడు. నిద్రాభంగం అయినందుకేమో తిరిగి నిద్రరాలేదు రాజాకి. మగతగా మంచం మీద అలాగే పడుకొన్నాడు.

పరంధామం దేనికోగానీ అరుస్తున్నాడు.

''ఎందుకూ గొంతు తెగిన మేకలా అరుస్తున్నారు'' అంటోంది పార్వతి.

రాజాకి అంత మత్తులోనూ నవ్వొచ్చింది.

''జంతువుల ఉపమానం లేకుండా మాట్లాడలేవా?'' ఎప్పట్లాగే కసురుకొంటూ అన్నాడు పరంధామం.

''నీ మందకి దాణా తయారుచేయాలింకా. బోలెడు పనుంది. వంటిల్లు బందుల దొడ్డిలా ఉంది. ఎందుకరిచారో చెబితే-నా పని నే చేసుకొంటా'' అందామె తన ధోరణిలో.

''ఖర్మ-ఖర్మ-నీ భాష ఈ జన్మకు మారదు. నా తెల్ల షర్టేది?''

''అది నల్లమేకతోలులా మాసిపోతే చాకలికి వేశా'' విసుగ్గా అంది పార్వతి.

''ఉన్న నాలుగు షర్టుల్లో రెండు సబ్బునీళ్ళలో నానేసావ్. ఒకటి చాకలికి వేశావ్. మరి పింక్ షర్టేది? అదిలా తగలెయ్''

''మీకు మొన్నో టిఫిన్ బాక్స్ చూపిస్తే బావుందని మెచ్చుకోలేదూ..''

''ఐతే ఏంటిట?''

''మరి అదెలా వచ్చిందనుకొన్నారు? ఆ షర్టేసికొంటేనే వచ్చింది.'' తాపీగా అందామె.

''అయ్యో! బంగారంలాంటి షర్ట్. ఇంకో రెండేళ్ళు ఈజీగా వేసుకోవచ్చనుకొన్నా- అంత మంచి షర్టిచ్చి ఆ బాక్స్ కొనకుంటే ఏమయింది? నీ స్టీల్‌సామాన్ల పిచ్చేంటోగానీ ఛస్తున్నా''

''ఎంతసేపలా అరుస్తారో అరుచుకోండి- పిల్లమంద లేచింది. వాళ్ళకీ మీకు కుడితివ్వాలి'' అంటూ 'కాఫీ' కలపడానికి వెళ్ళిపోయింది పార్వతి. వాళ్ళ అరుపులకి రాజా నిద్రమత్తంతా వదిలిపోయింది. లేచి బాత్‌రూమ్ వైపు నడిచాడు. ఆ నాలుగిళ్ల చావిడికి ఒకే బాత్‌రూమ్. రెండు లెట్రిన్స్. యధాప్రకారం లెట్రిన్ ముందు క్యూ ఉంది. ఎప్పుడూ రాజా ముందే లేస్తాడు కాబట్టి అతనికి ప్రాబ్లెం లేదు. ఎప్పుడన్నా ఆలస్యంగా లేస్తే తనవంతు వచ్చేవరకు నానాచావు చావాల్సిందే.

''ఏవండోయ్-చిన్నాడు బట్టల్లోనే పోయేట్టు ఉన్నాడు అసలే పరగడుపున ఆముదం తాగాడు. కాస్త లెట్రిన్ తలుపు తట్టండి. ఆ పక్కవాటా వెంకట్రావ్ మరిచిపోయి అందులోనే నిద్రపోతుంటాడు'' అంటోంది పారిజాతం.

ఇక లాభం లేదనుకొని అదే వీధిలో ఉన్న తన ఫ్రెండ్ రఘు రూమ్‌కి పరుగెత్తాడు రాజా. రఘుది సింగిల్‌రూమే గానీ, ఎటాచ్డ్‌బాత్, లెట్రిన్ రూములున్నాయ్. అద్దెమాత్రం ఎనిమిదొందలు. అంత ఇచ్చుకోలేకనే నాలుగిళ్ళ చావిట్లో ఉన్న ఓ సింగిల్ రూమ్‌లో, రెండొందల యాభైకి అద్దెకి ఉంటున్నాడు రాజా. కొత్తలో ఆ నాలుగిళ్ళ వాళ్ళు చేసే గోల భరించలేక ఖాళీ చేయాలనుకొన్నాడు. కానీ ఎక్కడా తక్కువలో రూమ్ దొరక్క అక్కడే అడ్జెస్ట్ అవసాగాడు. కొత్తలో నిద్ర కూడా పట్టేదికాదు-రాన్రాను-'గోల' లేకపోతే ఉండలేని స్థితికొచ్చాడు. తర్వాత్తర్వాత ఆ నాలుగిళ్ళ వాళ్ళతో అనుబంధమేర్పడి-వేరే రూమ్‌కెళ్ళే ఆలోచనే మానుకున్నాడు రాజా. అతని ఫ్రెండ్స్ ఆదివారం డబ్బుల్లేక సినిమాకెళ్ళలేకపోతే రాజా రూమ్‌కి వచ్చేస్తారు. ''ఇక్కడ బలే టైమ్ పాసవుతుంది'' అంటూ.

''ఏంట్రోయ్-పొద్దుటే దయచేశావ్? దానికేనా?'' అంటూ లెట్రిన్ వంక చూస్తూ అడిగాడు రఘు.

''ఆహా! అందుకే... '' అంటూ గబగబా అందులోకి దూరాడు రాజా.

తర్వాత...

''ఇవాళ నీ ప్రోగ్రాం ఏంటి?'' అడిగాడు రఘు.

''ఏమీ లేదు ఇవాళంతా ఫ్రీనే- నువ్వెక్కడికంటే అక్కడికి తయార్'' అన్నాడు రాజా హుషారుగా.

''ఏంట్రోయ్, ఎన్నాళ్ళకు విన్నానురా నీ నోటంట ఇలాంటి మాట.''

''మా ట్యూషన్ పిల్లలు ఊరెళ్ళారురా. అందుకే ఖాళీగా ఉన్నా. నేను నా రూమ్‌కి వెళ్ళి రెడీగా ఉంటా- నువ్ వచ్చెయ్.'' అంటూ విజిల్ వేసుకొంటూ వెళ్ళాడు రాజా.

వెళుతున్న రాజా వంకే చూస్తూ ఉండిపోయాడు రఘు.

రాజా వాళ్ళ నాన్న రైతు. ఆర్థికంగా కాస్త వెనుకబడి ఉన్నవాళ్ళు. అందుకే రాజా తన చదువుకోసం చిన్న ఉద్యోగం చూసుకొని పట్నానికి వచ్చేసాడు. తన ఖర్చులకి పోగా, ఇంటికి ఇంతో అంతో పంపుతూ ఉంటాడు కూడా. పొద్దుట లేవగానే ఓ గంటన్నర పేపర్లు-పాల పాకెట్స్ పంచుతాడు. వచ్చి స్నానం చేసి గంట పాటూ ట్యూషన్స్ చెబుతాడు. ఈలోగా ఆఫీస్ టైమవుతుంది. సాయంత్రం రాగానే రూమ్‌కొచ్చి రాత్రి వంట చేసుకొని- ఓ అర గంట రెస్ట్ తీసుకొని పార్ట్‌టైమ్ జాబ్‌కి వెళతాడు. వచ్చాక అన్నం తిని, ఓ గంటా గంటన్నర తన బుక్స్ తిరగేసి అప్పుడు పడుకొంటాడు. డిగ్రీ కంప్లీట్ చేసి ఇప్పుడు ఎం.బి.ఏకి ప్రిపేర్ అవుతున్నాడు. ఎన్ని పనులున్నా అతని మొహాన ఉన్న చిరునవ్వు సదా ఎదుటివారిని పలుకరిస్తూంటుంది.

★ ★ ★

హుషారుగా ఈల వేసుకుంటూ తన రూమ్‌లో అడుగుపెట్టాడు రాజా. అతనెప్పుడూ తన రూమ్‌కి తాళం వేయడు. మిగిలిన నాలుగిళ్ళలోని పిల్లలు వాళ్ళ గదులెప్పుడూ కన్‌జెస్టెడ్‌గా ఉంటాయి కాబట్టి రాజా రూమ్‌లో కూర్చుని నోట్సులు రాసుకొంటూ ఉంటారు. అలాగే పిల్లలే ఉన్నారనుకొని రూమ్‌లో కాలుపెట్టాడు రాజా. అక్కడో అమ్మాయ్ పరికిణీ వేసుకొని జాకెట్ హుక్స్ పెట్టుకుంటోంది.

రాజా స్టన్నయ్యాడు. ఆ అమ్మాయ్ తన ఎత్తయిన గుండెల్ని కవర్ చేసేలా ఓణీని నాలుగు మడతలుగా పెట్టి వేసుకొంటూ- నీడపడినట్టయి చూసింది తలెత్తి.


ఎదురుగా రాజా, ఏదో అపురూపమైనది చూస్తున్నట్లుగా.

ఆమె కంగారుగా ''ఏయ్ బుద్ధి లేదూ- అలా లోపలికొచ్చేశావ్'' అంటూ అరిచింది.

అంతవరకూ ఆమె అందాలు చూసిన రాజాకి ఒళ్ళు జల్లుమంది. ఆమేం అందో అరక్షణం తర్వాత అర్థమై మొహం ఎర్రగా అయింది. ''అసలు నువ్వెవరు? నా రూమ్‌లో నీకేం పని'' అన్నాడు కోపంగా.

''సారీ! ఇందాక..''

''ఆ ఫర్వాలేదు. మీ గది కాబట్టి మీరొచ్చారు. నేనే అనవసరంగా మిమ్మల్ని అన్నాను. ఏమీ అనుకోవద్దేం'' అంది నైస్‌గా.



ఇంతలో పారిజాతం పరుగున వచ్చింది. ''రాజా! అది మా అక్క కూతురు. సెలవులకి మా ఇంటికొచ్చింది. ఇప్పుడే ఇల్లు కడిగా- కిందంతా తడి ఉందని నీ రూంలో బట్టలు మార్చుకోనున్నాను'' అంది.

''ఓ... అలాగా! ఐయాం సారీ!'' అన్నాడతను గబగబా.

ఆ అమ్మాయేం బదులు చెప్పలేదు. కళ్ళతోనే సారీ అన్నట్లు చూసి, పారిజాతంతో కల్సి వెళ్ళిపోయింది. రాజా మనసంతా అదోలా అయింది. ఎందుకో ఆ అమ్మాయ్‌నే చూస్తూ ఉండిపోవాలన్పించింది- బాపూ మరీ అతిశయోక్తిగా- బొమ్మ లేస్తాడు. పిడికెడంత నడుము, చారెడంత కళ్ళూ, బారెడంత జడలతో అనుకొనేవాడు కానీ సాక్షాత్తూ ఆ బాపు బొమ్మలా ఉన్న ఆమెని చూస్తే కరెక్ట్‌గానే వేస్తాడు అన్పించింది. అతనా అయోమయపు అవస్థలో ఉండగానే, ఆ అమ్మాయే ఓ ప్లేట్లో రెండు సున్నుండలు, అరిశలూ- కారప్పూస పట్టుకొచ్చి ''పిన్ని ఇమ్మంది'' అంది.

''ఓ..అలాగా థాంక్స్-'' అంటూ ఆ పళ్ళాన్ని అందుకొని, ఆమె ఎక్కడ వెళ్ళిపోతుందోనని- అంతే ఐస్‌లా కరిగిపోయాడు.

''మీ పేరేంటి?'' అన్నాడు.

''వసుధ''

''చక్కటి పేరు'' మన స్ఫూర్తిగా అన్నాడు. ''మీలాగే'' అని మెల్లగా అంటూ- ''ఏ ఊరు?'' పరవశంగా అడిగాడు.

''వైజాగ్'' అంది.

''ఓహో, వెరీనైస్, అరకువేలీ చూశారా''

''ఓ బోలెడుసార్లు'' అంది కళ్ళని చక్రాల్లా తిప్పుతూ.

ఇంతలో ''రాజా! రాజా!'' అంటూ వచ్చాడు రఘు.

అతడ్ని చూస్తూనే ''వస్తా'' అంటూ వెళ్ళింది వసుధ.

మనసులో రఘుని తిట్టుకొన్నాడు రాజా.

''ఎవర్రా ఆ నేచురల్ బ్యూటీ'' అడగనే అడిగాడు రఘు.

ఒళ్ళు మండింది రాజాకి- ''పారిజాతం ఆంటీ వాళ్ళ బంధువులమ్మాయ్'' అన్నాడు క్లుప్తంగా.

''పద శేఖర్ దగ్గరికెడదాం- మనవాళ్ళంతా అక్కడుంటామన్నారు'' అన్నాడు రఘు.

గదిలోనే ఉంటే వసుధతో మాట్లాడే అవకాశం రావొచ్చన్న ఆశతో- ''నీ దగ్గర్నుండి వచ్చిందగ్గర్నుండీ అదేంటో ఒకటే కడుపు నొప్పిరా'' అన్నాడు రాజా, మనసులో సిగ్గుపడుతూ.

రఘు నిముషంపాటూ ఏమీ మాట్లాడలేదు.

''ఆరోగ్యవంతుడివి. నీకా నొప్పి ఎందుకొచ్చిందో అర్థం చేసుకోలేని ఫూల్‌ని కాను. ఓ.కె. ఎంజాయ్'' అంటూ వెళ్ళిపోయాడు రఘు.

'హమ్మయ్య' అనుకొంటూ చేతులూపుతూ ఎగరబోయాడు. రఘు చటుక్కున వెనుదిరిగేసరికి ఆ చేతుల్ని పొట్టమీదకు చేర్చాడు. నవ్వ

**వాలి హిరణ్మయీదేవి**

కుంటూ వెళ్ళిపోయాడు రఘు.

మూడో వాటాలో భార్యాభర్తలుంటారు- పేర్లు సీతా-రామం చూడముచ్చటయిన జంట. కొత్తకాపురానికి సీతతోపాటూ తోడొచ్చిన ఆమె అమ్మమ్మ ఆండాళమ్మ సంవత్సరంగా అక్కడే ఉంటోంది.

'పానకంలో పుడకలా ఈవిడొకర్తి' అంటూ రామం అప్పుడప్పుడూ రాజా దగ్గర వాపోతూ ఉంటాడు.

''రాజన్నయ్యా, రాజన్నయ్యా'' అంటూ వచ్చింది సీత. పారిజాతం వాళ్ళ ఇంటికే కళ్ళనప్పజెప్పిన రాజా ఉలిక్కిపడ్డాడు.

''ఏంటమ్మా'' అన్నాడు.

''ముల్తాన్ మట్టో- సుల్తాన్ మట్టో దొరుకుతుందటగా- తెచ్చిపెడతావా'' అంది మెల్లిగా సీత. ఆమెకు బ్యూటీ కాన్షస్‌నెస్ ఎక్కువ.

''మట్టెందుకు? ఏకంగా పేడ పూసుకోవే, ఇంకా తెల్లగా అవుతావ్'' అంది ఆండాళమ్మ ఆ వెనుకే వస్తూ.

''పో- అమ్మమ్మా! ఇంత మెల్లగా అడుగుతోన్నా నీ చెవులకెంత బాగా వినబడిందో. నీ కళ్ళూ ముక్కూ చెవులు ఇంత అద్భుతంగా పనిచేస్తాయ్'' అంది సీత.

''మా కాలంలో ఇన్ని సౌకర్యాలెక్కడివే. కడుపునిండా తినేవాళ్ళం. వంటి నిండా పని చేసే వాళ్ళం. కంటినిండా నిద్రపోయేవాళ్ళం. రెండు శేర్ల మినపప్పు అలా రుబ్బి పారేసేదాన్ని. తిరగట్లో గోధుమలు దగ్గర్నుండి అన్నీ విసిరేవాళ్ళం. రోట్లో నాలుగు పోట్లేస్తే పసుపు కొమ్ముల్నుండి పసుపు రాలేది''

''అమ్మమ్మ-అమ్మమ్మా! నీ శక్తి నాకు తెలీక వాగాను. ఇక ఫుల్‌స్టాప్ పెట్టవే తల్లీ'' అంది చెంపలేసుకొంటూ.

ఆ అమ్మమ్మా- మనవరాళ్ళ పోట్లాటలంటే ఎంతో ఇష్టం రాజాకి.

కానీ ఈరోజెందుకో అతనికి ముచ్చటగా తోచలేదు.

''దాన్ని ముల్తానా మట్టి అంటారుగానీ, తెచ్చిపెడతాలే'' అన్నాడు రాజా.

''అదుగో మా 'టెలీపతి' పిలుస్తున్నట్లున్నాడు'' అంటూ వెళ్ళింది. భర్త ఆకలో అంటే 'అలోపతి' అని, ఇంటి పనులు చేసినపుడు 'హోమియోపతి' అని రకరకాలుగా పిలుస్తూంటుంది. అతను ఫోన్ ముందున్నాడని అలా పిలిచిందని అర్థమయింది రాజాకి.

ఇక పారిజాతం వాళ్ళాయన భీమారావుకి తిండిపిచ్చి. ఎప్పుడూ పెళ్ళాన్ని ఏదో ఒకటి చేసిపెట్టమని వేధిస్తుంటాడు. ''చేయమని చెప్పారుగా- ఏదో నాకు తోచినట్లు చేస్తాగానీ పక్కనే కూర్చొని- పద్ధతులు చెప్పకండి'' అంటుందావిడ చిరాగ్గా.

''నేను చెప్పి చాకవపోతే నీకెలా తెలిసొస్తుంది'' అంటాడాయన అంతకంటే చిరాగ్గా.

''కాకరకాయ ఉల్లికారం పెట్టి చేసినపుడు నాలుగు వెల్లుల్లి రేకలు వేశావనుకో, అదిరిపోతుంది. ఏంటి ఆవడలు చేస్తున్నావా? కాసిన్ని ఆవాలు ముద్దగా నూరి పెరుగులో కలుపు. కాస్త అల్లం పచ్చిమిర్చి నూరి వెయ్. కరివేపాకులో తాళింపు పెట్టు, ఘుమ ఘుమలాడ్తాయ్. వడ్డించే ముందు సన్నగా తరిగిన కొత్తిమీర వెయ్- ఆ రుచే వేరు'' అంటూ ప్రతీ వంటకానికీ ఏది కలిపితే అదనపు రుచి వస్తుందో పెద్దగా అరిచి చెబుతుంటాడు. ఆయన మాటల వల్లే రాజాకి మొత్తం వంట వచ్చిందంటే అతిశయోక్తి కాదు.

''మీరు తెచ్చిందంతా తిండికే సరిపోతోంది. మావాళ్ళు అప్పుడప్పుడు సర్దబట్టిగానీ అప్పుల్లో మునిగుండేవాళ్ళం. ఐనా మగాడికింత తిండిపిచ్చి ఉండకూడదు. ఈ పిచ్చితో ఈ సంసారం ఎప్పటికి పైకొస్తుంది బాబూ'' అంటూ పారిజాతం నిట్టూరుస్తూ ఉంటుంది.

రోజులు చకచకా పరిగెడుతున్నాయ్. రాజా-వసుధల స్నేహమూ చిగురులు తొడిగి పూలు పూస్తోంది. బుద్ధిమంతుడైన రాజా సంగతి తెలుసు కాబట్టి వారి స్నేహాన్ని ఎవరూ అపార్థం చేసుకోలేదు.

ఓరోజు టీవీలో ఏదో పెళ్ళిచూపుల ప్రోగ్రాం వస్తోంటే యథాలాపంగా అడిగినట్లు ''వసూ! కాబోయే భర్త గురించి నీ ఊహలేంటి?'' అని అడిగాడు.

''కనీసం అతనికి పదీ-పన్నెండు వేల ఆదాయం ఉండాలి. నన్ను ప్రేమగా చూసుకోవాలి. ఎలాంటి దుర్వ్యసనాలు ఉండకూడదు. ముఖ్యంగా నాకో వ్యక్తిత్వం ఉందని గ్రహించాలి'' అందామె ట్రాన్స్‌లోకెళ్ళిపోతూ. ఆమె కోరికలన్నీ సబబుగా తోచినా- ''పదీ-పన్నెండు వేల ఆదాయం'' అన్న మాట పంటికింద రాయిలా తోచింది రాజాకి. ఎలాగన్నా మంచి జాబ్ సంపాదించి తీరాలని నిర్ణయించుకొన్నాడా క్షణాన్నే.

★ ★ ★

''ఏమండీ! బజారుకెళ్ళి టమోటాలు, నిమ్మకాయలూ తెండి'' అంది సీత.

''మొన్నేగా తెచ్చాడు. అవన్నీ ఎప్పట్లాగా మొహానికి రుద్దేశావా? ఎందుకే ఇంత షోకుల పిచ్చి?'' కోపంగా అంది ఆండాళమ్మ.

''అమ్మమ్మా నీకెందుకే? మగాళ్ళే ఆడది తన అందంతో ఆకట్టుకోవాలే''

''నీ మొహం ఏనాడన్నా అతను నిన్ను సరిగ్గా చూశాడాని అనుమానం. ఎప్పుడు ఏదో ఒకటి మొహాన పట్టించి దయ్యంలా ఉంటావ్. మొన్నటికి మొన్న ఆ పులిసిన పెరుగు తలకి పట్టించి ఇల్లంతా కంపు చేశావ్- ఆ పిల్లాడు పాపం ఇవన్నీ ఎలా భరిస్తున్నాడో'' అందావిడ.

''అమ్మమ్మా! నువ్వెప్పుడు ఊరెడతావో చెప్పవే, టికెట్ తెప్పిస్తాను'' అంది కోపంగా సీత.

''అయ్యో... అయ్యో- నాకేం గతిలేక నీ ఇంటి

## షాక్-షేక్

**సింగిల్ కిస్‌కి ఇంత షాకా! ఇలా అయితే థియేటర్లో ఇంక ప్రేక్షకులకి ఒకటే షేక్!**

-గీతా శ్రీనివాస్



కొచ్చానా? ఏదో మీ అమ్మా నాన్నా బతిమాల బట్టే- నీమీద నాకున్న (ప్రేమకొద్దీ వచ్చానుగానీ'' అందామె కళ్ళొత్తుకొంటూ.

''అబ్బా! ఏమన్నా అంటే చాలు 'కుళాయి' తిప్పేస్తావ్. నీళ్ళు చాలా అమూల్యమే తల్లీ- అన్నీ పొదుపుగా వాడాలిక్కడ'' అంది వెటకారంగా.

''సీతా! పెద్దావిడతో ఏంటా వేళాకోళాలు'' కోప్పడ్డాడు రామం.

''చూశావా! అంతా నీ మూలంగానే'' అంటూ కాళ్ళు గట్టిగా కొడుతూ బెడ్‌రూమ్‌లోకి వెళ్ళిపోయింది. ''హుష్'' అని తలపట్టుకొన్నాడు రామం.

ఆవిడగారి అలక తీరాలంటే గంట బతిమాలాలి. ఆవిడ కోరిన టాయ్‌లెట్ సామాన్లు తేవాలి. ఛ..పెళ్ళయిన వారం రోజుల వరకూ 'నెస్లే చాక్‌లెట్ బార్' కొనిస్తేగానీ దగ్గరికి రానిచ్చేది కాదు. ఛ 'లంచం అలవాటు చేస్తే జీవితాంతం బాధపడాల్సిందే అనుకొంటూ తన జేబువైపోసారి చూసుకొని- బెడ్‌రూమ్‌లోకి దారితీశాడు రామం.

★ ★ ★

''రాజా! రాజా! నీకు మంచి సైకియాట్రిస్ట్ ఎవరన్నా తెలుసా'' అంది నాలుగో వాటాలో ఉంటోన్న శారద.

''ఎందుకు? వదినా?'' అడిగాడు రాజు. ఆమె ముందుకి కుర్చీని తోస్తూ.

''మీ అన్నయ్యతో వేగలేకపోతున్నానయ్యా. నోట్లో నాలుక లేనివాడు బుద్ధిమంతుడూ అంటూ ఈయనకిచ్చి కట్టబెట్టారు. పదేళ్ళ కుర్రాడికి ఉండే తెలివి తేటలు లేవు. మొన్న కరెంట్ పోతే అర్ధరాత్రి లేచి అగ్గిపుల్ల వెలిగించారు. ఎందుకండీ అంటే ఫాన్ తిరుగుతోందో, లేదో చూస్తున్నా అన్నారు''

నవ్వొచ్చినా కంట్రోల్ చేసుకొన్నాడు రాజా. నిజమే పాపం- వెర్రిబాగుల వెంకట్‌రావ్‌తో వేగడం ఆమెకి దినదిన గండమే. తను వాళ్ళింటికి వెళ్ళినప్పుడు ఎవరో ఫోన్ చేసి, ''మూడూ, నాలుగూ, రెండూ, సున్నా- సున్నా- తొమ్మిదేనా'' అనడిగితే ''ఇంత చిన్న లెక్కకోసం నాకు ఫోన్ చేయాలా? అన్నీ పేపర్ మీదేసి కూడుకోండి'' అంటూ పెట్టేసాడు.

తను ఆశ్చర్యపోయి ''నీ తలనిండా మట్టే ఉంది'' అని కోప్పడితే ''నయం, మీ వదినయితే మీ బుర్రంతా ఖాళీ'' అంటుంది అన్నాడు. సరైన సంపాదన లేదు. ఈమె మిషన్ కుట్టి సంపాదించే డబ్బుతో సరైన వస్తువులూ కొని తేలేడు. శారద కాబట్టి అతన్తో వేగుతోంది. ఈ కాలపు పిల్ల లాంటిదైతే మూడో రోజునే విడాకులిచ్చేది- అనుకొన్నాడు రాజా.

''ఏంటి రాజా! ఏమ్మాట్లాడటం లేదు'' దిగులుగా అడిగింది శారద.

''ఆ... కనుక్కొని చెబుతా వదినా'' అన్నాడు రాజా.

''తొందరగా కనుక్కొని చెప్పు. పారిజాతం వసుధని దింపిరావడానికి వైజాగ్ వెడుతోంది. ఈ నాల్రోజుల్లో మనం వెళ్ళొద్దాం. ఆవిడకు తెలిసిందంటే మా ఆయన్ని పిచ్చాడంటూ ప్రచారం చేస్తుంది'' అంది.

ఎందుకోగానీ వారిద్దరికి పడదు. ''పిల్లైనంత తొందరగా కనుక్కో'' మళ్ళీ చెప్పి వెళ్ళిపోయింది శారద.

వసుధ వెళ్ళిపోతోందంటే మనసంతా బాధగా తయారైంది రాజాకి.

ఆ సాయంత్రం కావాలనే స్టేషన్‌కి వెళ్ళాడు. పారిజాతం సామాన్లు లెక్క చూసుకొంటూంటే వసుధతో ''వసూ! ఓ రెండేళ్ళు నాకోసం వెయిట్ చేయగలవా? ఈలోగా మంచి జాబ్‌ని సంపాదించి, మీవాళ్ళని కలుస్తాను'' అన్నాడు గబగబా.

వసుధ ఆశ్చర్యపోయింది. అతనంత సూటిగా తన నిర్ణయాన్ని తెల్పినందుకు. ఆమె కళ్ళలోని మెరుపుతో ఆమెకు తన పట్లగల ఇష్టాన్నిట్టే గ్రహించాడు. రైలు కదిలిపోయింది.

★ ★ ★

ఆరోజు చాలా హుషారుగా ఉన్నాడు రాజా. ఎప్పట్నుంచో పారిజాతం వాళ్ళాయనకేదన్నా మంచి జాబ్ చూపించమని అడుగుతోంది. ఓ పెద్ద పేరున్న హోటల్‌లో కుకింగ్ సెక్షన్‌లో సూపర్‌వైజర్ పోస్ట్ పారిజాతం వాళ్ళాయనకి ఇవ్వడానికి, రాజాకి తెలిసినతను ఒప్పుకొన్నాడు. ఆ మాట చెప్పడానికే వాళ్ళ వాటాలో అడుగెట్టాడు రాజా.

అప్పుడు ఏదో వంట గురించి భార్యకి సలహా ఇవ్వబోతున్న భీమారావ్‌తో ''అంకుల్ మీకు 'హోటల్ రుచి'లో జాబ్. ఇక మీదట మీ సలహాలన్నీ అక్కడి కుక్‌కి ఇవ్వండి'' అన్నాడు.

''అబ్బ చక్కెరపాకం చెవుల్లో పోసినట్లుంది బాబూ'' అన్నాడాయన.

## కిమ్ క్రేజ్!

**'మొహబ్బత్' సినిమాలో నటించి సంచలనం సృష్టించిన కిమ్‌శర్మపై ప్రేక్షకులు ఎంతో మొహబ్బత్ (ప్రేమ) పెంచుకున్నా ఆ తరువాత ఆమె ఏ చిత్రంలోనూ నటించకపోవడంతో ఆమె అభిమానులు నిరాశకు గురయ్యారు. కానీ కిమ్ నటించే చిత్రాలు ఐదారు రాబోతున్నాయి. వీటిలో తొలి చిత్రం 'తుమ్‌సే అచ్ఛా కౌన్ హై'. మరి కిమ్ దశ ఎలా వుందో?**

-మానస



''అబ్బ-ఈయనగారి తిండి పిచ్చికి తగిన ఉద్యోగం అది. వచ్చి నీ కడుపున పుడతా నాయనా'' అంది పారిజాతం.

''పుడుదురుగానీ-కానీ వసుధా వాళ్ళ పేరెంట్స్‌ని పెళ్ళికి ఒప్పించండి మరి'' అన్నాడు రాజా.

''హోర్నీ-నా మీది ప్రేమతో కాదన్నమాట నాకిదిప్పించింది'' అన్నాడు భీమారావ్ నవ్వుతూ

''సరే బాబూ ప్రయత్నిస్తాను'' అంది పారిజాతం.

★ ★ ★

''రాజా! రాజా! నీకు తెల్సిన మంచి స్కిన్ స్పెషలిస్ట్ ఉన్నాడా?'' అంటూ కంగారుగా వచ్చాడు రామం.

''దేనికి?'' అడిగాడు రాజా.

''నిన్నేదో ఫేస్‌మాస్క్- అంటూ దిక్కుమాలిందేదో రాసుకొంది సీత. మొహమంతా ఎర్రగా దద్దుర్లొచ్చాయ్. స్వెల్లింగ్ కూడా వచ్చి మొహం గుర్తుపట్టరాకుండా అయింది'' అన్నాడతను.

''ఎందుకే దిక్కుమాలిన శోకులంటే విన్నావా?'' అంటూ రాగాలు తీసింది ఆండాళమ్మ.


''నాకు తెల్సిన డాక్టరొకాయన బ్యాంక్ స్ట్రీట్లో ఉన్నారు. కానీ మరి ఫీజులు బాగా వసూలు చేస్తాడు'' అన్నాడు రాజా.

''ఎంత డబ్బు ఖర్చయినా ఫర్వాలేదు. పాపం సీత బైటకు రావడానికే సిగ్గుపడుతోంది'' అన్నాడు రామం.

## ప్రేమలో అక్షయ్?

**పడతానండీ ప్రేమలో మరి! పట్టుకునే ప్రియురాళ్లేరండీ! అని అక్షయ్ కుమార్ అంటున్నట్టు లేదూ!**

-గీతా శ్రీనివాస్



''రాజన్నయ్యా! ప్లీజ్ ఆ డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళి నా మొహాన్ని మామూలుగా చెయ్. ఇక జీవితంలో ఆ శోకుల జోలికి పోను'' అంది ఏడుస్తూ సీత.ఆ ముగ్గుర్నీ తీసుకొని డాక్టర్ దగ్గరికి బయల్దేరాడు రాజా.

★ ★ ★

మాంఛి లిమిటెడ్ కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పోస్ట్ రాగానే మేఘాల్లో తేలిపోడం- అనుభవంలోకి వచ్చింది రాజాకి. వెంటనే ఫోన్‌లో ఆ వార్త వసుధకి చెప్పేశాడు. తన కంపెనీ స్టేటస్‌ని దృష్టిలో పెట్టుకొని పేపర్లు, పాలపాకెట్స్ పంచడం మానేసి, ఆ టైమ్‌లో మరొక నల్గురికి ట్యూషన్స్ మొదలెట్టాడు. దాంతో సంపాదన మరింత పెరిగింది. ఇంటికి అవసరమైన ఫ్రిజ్, టీవీ, వాషింగ్ మిషన్‌లను కొనే ప్రయత్నంలో మునిగాడు.

★ ★ ★

''రాజా! రాజా'' అంటూ తలుపు తట్టింది పార్వతి.

''ఏంటి పిన్నీ'' అంటూ తలుపు తెరిచాడు రాజా.

''బాబూ..ఓ వెయ్యి రూపాయలు సర్దగలవా? ఇవీ, పోయిన్నెల్లో తీసుకొన్నవీ, వచ్చే నెలాఖర్లో ఇస్తాను'' అంది.

''లేవు పిన్నీ, మొన్న ఫ్రిజ్ కొన్నాగదా..అయినా ఓ మాట చెబుతాను ఏమీ అనుకోవద్దు- వేలు వేలు పెట్టి బట్టలుకొని - వాటిని వందల్లో వచ్చే స్టీల్ సామాన్లకు వెయ్యడం బట్టలకు ఇబ్బంది పడటం ఏం బావుంది. ఇప్పటికే అందరూ మీకు 'స్టీలుపిచ్చిది' అన్న పేరు పెట్టేసారు. ఇలా ఉంటే మన చిన్నీకి ఏవన్నా సంబంధాలొస్తాయా? ఆలోచించండి'' అన్నాడు.

అప్పటికే కొంత రియలైజ్ అయిన పార్వతి రాజా మాటల్లోని సత్యాన్ని గమనించి, ''ఇక మీదట మునుపట్లా ప్రవర్తించను బాబూ. నిజమే నా పిచ్చి వల్ల పిల్ల పెళ్ళికిబ్బంది వస్తే ఎలా'' అంది.

ఇవన్నీ ఎక్కడి నుంచి విన్నాడోగానీ పరంధామం విని ''రాజా! మంచి మాట చెప్పావు- నీమాటంటే చాలా గురి. ఇక మీదట మా సమస్యలు చాలావరకూ తీరినట్లే'' అన్నాడతను ఆనందంగా.

★ ★ ★

రాజా వారం రోజులు క్యాంప్‌కెళ్ళి వచ్చేసరికి శారదా వాళ్ళు తమ పోర్షన్ ఖాళీ చేశారని తెలిసింది. ఎవరో దూరపుబంధువు హైద్రాబాద్‌కి వచ్చి ఆక్సిడెంట్లై కాలు విరిగితే, శారదే పాపం నెలల తరబడి సేవలు చేసిందొకప్పుడు. ఆ దూరపు బంధువు తనకెవరూ వారసులు లేకపోవటం వల్లనూ, శారద తనకు సేవలు చేసినందుకూ ప్రతిఫలంగానూ తన ఇంటిని పొలాన్ని ఆమెకు రాశాడుట. ఆ వార్త తెలిసి నిజంగా చాలా సంతోషించాడు రాజా. నిస్వార్థంగా మనం సహాయం చేస్తే భగవంతుడు చల్లగా చూస్తాడన్నమాట ఎంతో నిజం అనుకొన్నాడు. వెంకట్‌రావ్‌లోనూ, సైకియాట్రిస్ట్ పుణ్యమాని కొంత మార్పు వస్తోందీ మధ్య. ఆర్థికంగా కూడా ఇపుడు బాధల్లేవు కాబట్టి ఆమె కథ సుఖాంతం అనుకొన్నాడు రాజా. శారదా వాళ్ళ పోర్షన్ కూడా తనే తీసేసుకున్నాడు.

★ ★ ★

రోజులు చకచకా దొర్లిపోతున్నాయ్. రాజా ఉద్యోగంలో చేరి ఏడాది కాకపోయినా అతని ఎఫిషియన్సీ వల్ల ఏరియా సేల్స్ మేనేజర్‌గా ప్రమోషన్ ఇచ్చారు. జీతం డబులయింది. కోరుకుంటే అంత కన్నా మంచి ఇంట్లో ఉండే అవకాశం ఉన్నా- వారందరితో పెనవేసుకొన్న బంధంతో, తన కొత్తకాపురం ఆ నాలుగిళ్ళ చావిట్లోనే మొదలవ్వాలి అనుకొని- అక్కడే ఉండసాగాడతను.

ఈసారి టూర్ నుండి రాగానే ఆండాళ్ళమ్మ నవ్వుతూ అతనికి ఎదురొచ్చి ''ప్రతీసారి నువ్ రాగానే గుడ్ న్యూస్ చెబుతున్నా-ఈసారేంటో తెలుసా. వసుధా వాళ్ళ తల్లిదండ్రులు మీ ఊరికి వెళ్ళారు. నువ్ రాగానే నిశ్చయతాంబూలాలు తీసుకోవాలన్న నిర్ణయానికి వచ్చారు. ఇంత మంచి న్యూస్ చెప్పినందుకేమిస్తావ్'' అంది ఆమె నోరంతా తెరిచి నవ్వుతూ.

''మీకే కాదు-పారిజాతం ఆంటీకి, పార్వతి ఆంటీకి, సీతకు, శారద వదినకు, నా పెళ్ళిలో చీరలు పెడతాను. పెళ్ళి పెత్తనమంతా మీదే'' అన్నాడు రాజా సంతోషంగా.

''అయితే ఇంకేం! రాజన్నయ్య పెళ్ళివరకూ అమ్మమ్మ ఇక్కడే ఉంటుంది'' అంది సీత ఆనందంగా.

''హో... జిందగీ భర్ ఏ హబాబ్ కద్దీ సాత్ రహేతే క్యా-'' అంటూ వచ్చీరాని హిందీలో రామం అనేసరికి అందరూ ఫకాల్న నవ్వారు.